క్లుప్తంగా

రాజీ మార్గమే రాజ మార్గం



ఆర్మూర్‌టౌన్: రాజీ మార్గమే రాజ మార్గమని, కక్షిదారులు కోర్టుల చుట్టూ తిరుగకుండా సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి వేముల దీప్తి అన్నారు. ఆర్మూర్ కోర్టు ఆవరణలో ఈ నెల 28న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌పై శుక్రవారం జూనియర్ సివిల్ జడ్జి వేముల దీప్తి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...జాతీయ లోక్ అదాలత్ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్డీవో రాజాగౌడ్, ఏసీపీ బస్వారెడ్డి, అదనపు పీపీ రామకృష్ణ, సీఐలు రవి కుమార్, శ్రీధర్‌రెడ్డి, నవీన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు, అన్నప్రాశనలు



రెంజల్(బోధన్): మండలంలోని బాలింతలు, గర్భవతులకు శుక్రవారం రెంజల్ ఎంపీడీవో కార్యాలయంలో సామూహిక అన్నప్రాసన, సీమంతాలు నిర్వహించారు. బోధన్ ఐసీడీఎస్ సెక్టార్ ఆధ్వర్యంలో పోషణమాసం కార్యక్రమాన్ని పండుగలా చేపట్టారు. ఎంపీడీవో వెంకటేశ్‌జాదవ్, తహసీల్దార్ శ్రావణ్ కుమార్, ఎంఈవో గణేశ్‌రావ్, బోధన్ సీడీపీవో జానకమ్మలు మాట్లాడుతూ.. మహిళల్లో రక్తహీనత రాకుండా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వాలు అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోషకాహార లోపం వల్ల వచ్చే నష్టాలను వివరించారు. మండల సూపర్‌వైజర్ ప్రమీలారాణి, ఆరోగ్య విస్తరణ అధికారి రవీందర్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఉత్తమ గణేశ్ మండపాలకు బహుమతుల ప్రదానం



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని లయన్స్ భవన్‌లో శుక్రవారం లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ నవనాథపురం ఆధ్వర్యంలో ఉత్తమ గణేష్ మండపాలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు చెరుకు పృథ్వీరాజ్, కోశాధికారి నారాయణగౌడ్, సభ్యులు అంబల్ల తిరుపతి, లోచారం చంద్రశేఖర్, గుర్రం విజయానంద్, శశిధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోవాలి

ఆర్మూర్: తెలంగాణ సర్వశిక్షాభియాన్ సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో అందిచే ఉచిత ఫిజియోథెరపీ శిక్షణ సేవల ప్రాధాన్యతను గుర్తించి వైకల్యంతో బాధపడే పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్మూర్ మండల విద్యాధికారి రాజగంగారాం సూచించారు. ఆర్మూర్ పట్టణంలోని భవిత కేంద్రంలో ఉచిత ఫిజియోథెరపీ శిబిరాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిత కేంద్రంలో ప్రతి వారం ఉచితంగా ఫిజియోథెరపీ సేవలను అందిస్తున్నామని తెలిపారు. ఫిజియోథెరపీ వైద్యురాలు రేణుక చిన్నారులకు ఫిజియోథెరపి చికిత్సను అందించారు. ఇన్‌క్లూసివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్ కిషన్, సురేష్, ఎంఐఎస్ కో–ఆర్డినేటర్ అలేఖ్య, ఆపరేటర్ రఘు, మెసెంజర్ రవి, సీజీవీ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

రుద్రూర్: గ్రామాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని కోటగిరి మండల ప్రత్యేకాధికారి ఎంఏ అలీం అహ్మద్ సూచించారు. కోటగిరి మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించి స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న పనులను పరిశీలించారు. పోతంగల్ మండల కేంద్రంలో లబ్ధిదారులకు మహాలక్ష్మి సర్టిఫికెట్లు అందజేశారు. ఆయన వెంట ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో చందర్, జీపీ కార్యదర్శులు ఉన్నారు.

పంట పొలాల పరిశీలన

రుద్రూర్: రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్రాన్ని రాష్ట్ర వ్యవసాయ విస్తరణ సంచాలకులు జమున రాణి శుక్రవారం సందర్శించారు. అనంతరం కేవీకే శాస్త్రవేత్తలతో కలిసి రైతుల పొలాల్లో చేపట్టిన వివిధ సాంకేతిక క్షేత్రస్థాయి ప్రదర్శనలు పరిశీలించారు. పోతంగల్ మండలం హెగ్డోలి, కోటగిరి మండలం ఎత్తొండ శివారుల్లో పర్యటించి పంట పొలాలను పరిశీలించారు. నూతన సాంకేతిక పద్ధతులను రైతులకు వివరించారు. కేవీకే కో–ఆర్డినేటర్ టి అంజయ్య, శాస్త్రవేత్తలు రాజ్‌కుమార్, పి విజయ్ కుమార్, డాక్టర్ శ్వేత, వ్యవసాయ విస్తరణ అధికారి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నాటుడెందుకు.. నరుకుడెందుకు?

- విద్యుత్ తీగలకు అడ్డం వస్తున్నాయని చెట్ల నరికివేత
- మోర్తాడ్ రైల్వే స్టేషన్‌కు వెళ్లే మార్గంలో పెరిగిన చెట్లను కొట్టివేయించిన విద్యుత్ ఉద్యోగులు



మోర్తాడ్ రైల్వే స్టేషన్‌కు వెళ్లే మార్గంలో నరికేసిన చెట్లు

మోర్తాడ్(బాల్కొండ): ఒకవైపు వన మహోత్సవం కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్విరామంగా కొనసాగిస్తూ ఉంటే మరో పక్క పదేళ్ల కింద నాటిన మొక్కలు పెరిగి పెద్దవి అయ్యాక విద్యుత్ తీగెలకు ఆటంకం అని నరికివేసిన విచిత్ర పరిస్థితి మోర్తాడ్‌లో చోటు చేసుకుంది. మోర్తాడ్‌లోని రైల్వే స్టేషన్‌కు వెళ్లే దారిలో హరితహారం మొదటి విడతలో భారీ సంఖ్యలో మొక్కలను నాటారు. వాటిని అప్పటి సర్పంచ్ దడివె నవీన్ నేతృత్వంలో మొక్కలను కంటికి రెప్పలా కాపాడుతూ వచ్చారు. స్టేషన్ దారికి ఇరువైపులా నాటిన మొక్కలతో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది. నీడను ఇస్తూ పర్యావరణానికి ఎంతో మేలు చేస్తున్న చెట్లు విద్యుత్ లైన్‌కు అడ్డంగా వస్తున్నాయనే కారణంతో విద్యుత్ సిబ్బంది వాటిని ప్రొక్లైన్‌తో పెకిలివేయించారు. అంతటితో ఆగకుండా దుంగలుగా నరికి విక్రయించడానికి అన్నీ సిద్ధం చేశారు. విద్యుత్ ఉద్యోగులే ఈ పని చేసినా కనీసం గ్రామ పంచాయతీ ఉద్యోగులకు సమాచారం ఇవ్వకపోవడం గమనర్హం. చెట్లను ఒక పక్క గ్రామ పంచాయతీ ఉద్యోగులు కాపాడుతూ ఉంటే విద్యుత్ ఉద్యోగులు లైన్‌కు ఆటంకం అని నరికివేయించడంతో నీడ కరువైంది. రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటే సమయంలోనే విద్యుత్, పంచాయతీరాజ్ శాఖలు సమన్వయం చేసుకుని ఉంటే ఇలా చెట్లను నరికివేసే పరిస్థితి ఏర్పడదని పలువురు సూచిస్తున్నారు. విద్యుత్ లైన్ వేసే మార్గాన్ని అధికారులు ముందుగానే గుర్తించి ఆ లైన్‌కు దూరంగా మొక్కలను నాటించే చర్యలు చేపట్టాలని పర్యావరణ ప్రేమికులు విన్నవిస్తున్నారు. ఎలాంటి పరిస్థితిలోనైనా మొక్కలను సంరక్షించుకోవడమే తప్ప నరికివేయడం సరైన పద్ధతి కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయం చేసుకుని వన మహోత్సవంలో నాటే మొక్కల సంరక్షణపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి గౌరవమెక్కువ



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న అధికారులు

రెంజల్(బోధన్): ఉపాధ్యాయ వృత్తికి సమాజంలో గౌరవం ఎక్కువని ఎంపీడీవో వెంకటేశ్‌జాదవ్, ఎంఈవో గణేశ్‌రావ్‌లు అన్నారు. మండల విద్యా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఆదర్శ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. నేటి బాలలను రేపటి పౌరులుగా తీర్చిదిద్దే అవకాశం ఒక్క ఉపాధ్యాయులకే దక్కుతుందన్నారు. ప్రభుత్వ అధికారుల్లో అన్ని శాఖల కంటే ఉపాధ్యాయులకు సముచిత గౌరవం లభిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులకు ప్రాథమిక స్థాయిలో విద్యను అందించిన గురువులు చిరస్థాయిగా గుర్తుంటారని వివరించారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు ఇల్టెపు శంకర్, మండల పీఆర్‌టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమలింగంగౌడ్, కిషోర్‌కుమార్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, నోడల్ అధికారి ఆంజనేయులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

మండల స్థాయిలో 15 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి సన్మానించారు. శాలువాలతో సత్కరించి ప్రసంసా పత్రాలను అందించారు. అనురాధ, సోహెల్, వెంకటలక్ష్మి, గంగాధర్, సిరాజుద్దిన్, అనంతస్వామి, కరీం, గోపీ, సబా ఉస్మాన్, పాజియా తబస్సుమ్, వసీం ఉన్నీసా, లింగన్న, నిర్మల, స్రవంతి, మనీషాలు ఉన్నారు.

ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చాలి



ఆర్మూర్‌టౌన్: ఆర్టీసీ డ్రైవర్లు ప్రయాణికులను క్షేమంగా వారి గమ్యస్థానాలకు చేర్చాలని డిప్యూటీ ఆర్ఎం సరస్వతి అన్నారు. ఆర్మూర్ ఆర్టీసీ డిపోలో శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రయాణికులు ఆర్టీసీని ఆదరించాలన్నారు. అనంతరం వైద్యులు ఆర్టీసీ సిబ్బందితో పాటు వారి కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. డిపో మేనేజర్ రవికుమార్, ట్రాఫిక్ ఎస్సై పారు, గంగాకిషన్, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులతో డీఈవో దుర్గా ప్రసాద్

పెర్కిట్(ఆర్మూర్): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని డీఈవో దుర్గా ప్రసాద్ అన్నారు. ఆలూర్ మండలం మిర్దాపల్లి పాఠశాలలో శుక్రవారం ఆలూర్ మండల అంతరపాఠశాల క్రీడా సంబరాలను శుక్రవారం డీఈవో దుర్గా ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. అనంతరం మార్చ్‌ఫాస్ట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కల్లెడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు బహుమతులను అందజేశారు. ఆర్డీవో రాజా గౌడ్, ఆలూర్ తహసీల్దార్ రమేష్, ఎంఈవో రాజ గంగారాం, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కిషన్, మిర్దాపల్లి హెచ్ఎం కుంట శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



రుద్రూర్: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని శుక్రవారం స్థానిక తహసీల్దార్ తారాబాయి ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వంట గది పరిసరాలు శుభ్రంగా ఉంచాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. ట్రంక్ బాక్సులు, సరిపడా బెడ్‌లు లేవని, వాష్ రూంలు కొన్ని పని చేయడం లేదని విద్యార్థులు తహసీల్దార్ దృష్టికి తెచ్చారు. ఆర్ఐ నజీర్, జూనియర్ అసిస్టెంట్ భూషణ్, ప్రిన్సిపాల్ శ్యామల తదితరులున్నారు.

దసరా వరకు భవనాన్ని మార్చండి

- లేదంటే టీసీలు తీసుకెళ్తాం
- గురుకుల విద్యార్థుల తల్లిదండ్రుల అల్టిమేటం



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ లక్ష్మణ్

దొంకేశ్వర్(ఆర్మూర్): దసరా వరకు బిల్డింగ్ మార్చకపోతే టీసీలు తీసుకెళ్తామని నూత్‌పల్లి బీసీ గురుకుల పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులకు అల్టిమేటం జారీ చేశారు. 400 మంది ఉన్న గురుకులంలో సరైన వసతులు, గదులు లేక కొన్నేళ్లుగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. భవనాన్ని మారుస్తామని అధికారులు చెప్పడమే తప్ప చేయడం లేదని, ఓపిక నశించిన తల్లిదండ్రులు శుక్రవారం నూత్‌పల్లి గురుకులానికి తరలివచ్చారు. తమకు టీసీలు ఇవ్వాలని ప్రిన్సిపల్‌పై ఒత్తిడి తెచ్చారు. ఆర్‌సీవో ద్వారా జిల్లా కలెక్టర్‌కు సమాచారం అందించగా గురుకుల ఆవరణలోనే తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ప్రిన్సిపల్ లక్ష్మణ్ వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఆర్మూర్‌లో ఒక భవనాన్ని చూశామని అందులోకి మారేవరకు కొన్ని రోజులు ఓపికపట్టాలని తల్లిదండ్రులను కోరారు. దసరా సెలవులు ముగిసి గురుకులం ప్రారంభమయ్యే నాటికి భవనాన్ని మార్చకపోతే విద్యార్థులను పంపించబోమని, టీసీలు తీసుకెళ్తామని తల్లిదండ్రులు స్పష్టం చేశారు.

విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు పెంపొందించాలి

రుద్రూర్: విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు పెంపొందించాలని మండల విద్యాధికారి నాగనాథ్ సూచించారు. రుద్రూర్ మండల విద్యా వనరుల కేంద్రంలో శుక్రవారం ప్రాథమిక స్థాయి కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని, అభ్యాసన ప్రక్రియలు పూర్తి చేయించాలన్నారు. మండల నోడల్ ఆఫీసర్ శ్రీనివాస్, సీఆర్‌పీ అంబర్ సింగ్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాణ్యమైన పురుగు మందులను విక్రయించాలి



మాట్లాడుతున్న ఏడీఏ ఎంఏ అలీం

బోధన్: పంటల సస్యరక్షణకు నాణ్యమైన పురుగు మందుల మాత్రమే విక్రయించాలని బోధన్ ఏడీఏ ఎంఏ అలీం ఆదేశించారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని ఏఎంసీ ఆవరణలో గల రైతు వేదిక భవనంలో నియోజకవర్గ స్థాయి పురుగు మందుల దుకాణాల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. నిబంధనల ప్రకారం డీలర్లు కచ్చితంగా ప్రిన్సిపుల్ సర్టిఫికెట్స్ కలిగి ఉండాలని తెలిపారు. పురుగు మందుల కొనుగోలు సందర్భంగా ఇతర మందులను రైతులకు బలవంతంగా అంటగట్టవద్దన్నారు. సమావేశంలో బోధన్, ఎడపల్లి, రెంజల్, నవీపేట మండలాల ఏవోలు సంతోష్, లక్ష్మీకాంత్ రెడ్డి, సిద్ధిరామేశ్వర్, నవీన్, డీలర్లు పాల్గొన్నారు.

సమాచారం

రేపు కరెంట్ సరఫరాలో అంతరాయం

బోధన్ రూరల్(బోధన్): విద్యుత్ శాఖ బోధన్ సబ్ డివిజన్ పరిధిలోని రెంజల్, ఎడపల్లి, బోధన్ మండలాల్లోని నీలా, తాడ్‌బిలోలి, మంగల్‌పాడ్, ఠాణాకలాన్, చెక్కి క్యాంప్, చిన్న పెంటా సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు శనివారం సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు కరెంట్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏడీఈ ముక్తార్ శుక్రవారం తెలిపారు. సబ్‌స్టేషన్లల్లో నెలవారీ మరమ్మతుల కారణంగా అంతరాయమేర్పడుతుందని చెప్పారు.

దొంగిలించారు.. ఢీకొట్టారు.. వదిలేశారు

బోధన్: పట్టణంలోని శర్బతీ కెనాల్ ప్రాంతానికి చెందిన సయ్యద్ గులాం మహ్మద్‌కు చెందిన టవేరా వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. వివరాలు.. సయ్యద్ గురువారం రాత్రి రోజూ మాదిరిగానే శర్బతీ కెనాల్(పంట కాలువ) రోడ్డు పక్కన తన వాహనాన్ని నిలిపి మరో వీధిలో ఉన్న ఇంటికి వెళ్లి నిద్రించాడు. శుక్రవారం తెల్లవారు జామున వచ్చి చూడగా వాహనం కనిపించలేదు. పరిసర ప్రాంతాల్లో వాహనం కోసం వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. టౌన్ సీఐ వెంకట నారాయణ సీసీ కెమెరాలను పరిశీలించగా పట్టణ కేంద్రం నుంచి బెల్లాల్ గ్రామం మీదుగా మోస్రా రోడ్డు మార్గంలో వాహనం వెళ్లినట్లు గుర్తించారు. ఆ వైపు సిబ్బందితో వెళ్లి పరిశీలించగా, మల్కాపూర్ తండా వద్ద డివైడర్‌ను వాహనం ఢీకొట్టి ఉన్నట్లు గుర్తించారు. డివైడర్‌ను ఢీకొట్టగానే దొంగలు వాహనాన్ని అక్కడే నిలిపి పరారైనట్లు భావిస్తున్నారు. వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

అంగన్‌వాడీ కేంద్రంలో చోరీ

బోధన్: పట్టణ కేంద్రంలోని బీటీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం నిత్యావసర సరుకులను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. ఆరు సంచుల బియ్యం, మంచి నూనె, కాటన్ చోరీకి గురైనట్లు అంగన్‌వాడీ కేంద్ర నిర్వాహకులు ఐసీడీఎస్ అధికారులకు సమాచారం ఇచ్చారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సీడీపీవో జానకి తెలిపారు.

కేబుల్స్ చోరీ కేసులో ముగ్గురి రిమాండ్

బోధన్ రూరల్: కేబుల్స్ చోరీ కేసులో ముగ్గురి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ తెలిపారు. భూలక్ష్మి క్యాంప్‌లో నరేష్ అనే రైతు తన బోర్ మోటార్ కేబుల్ వైర్ చోరీకి గురైనట్లు కొన్ని రోజుల క్రితం బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా జీవన్, మహేందర్, కిషన్ అనే ముగ్గురు వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకుని శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆడ శిశువు జన్మిస్తే రూ.5 వేల నగదు

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో ఏ ఇంటిలోనైనా ఆడ శిశువు జన్మిస్తే రూ.5 వేల నగదు అందిస్తానని గతంలో ఉమ్మడి బాల్కొండ మాజీ జెడ్పీటీసీ జోగు సంగీత ప్రకటించారు. మండల కేంద్రానికి చెందిన పొన్న రమణికకు ఆడశిశువు జన్మించడంతో శుక్రవారం రూ.5 వేల నగదు అందజేశారు. భవిష్యత్తులో ఈ సహాయాన్ని మరింత ఎక్కువగా పెంచాలనే ఆలోచన ఉందన్నారు.

పంటల నమోదు పరిశీలన



మోర్తాడ్: మండలంలోని శెట్‌పల్లిలో కొనసాగుతున్న క్రాప్ బుకింగ్‌ను జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ శుక్రవారం పరిశీలించారు. వరి పంటను పరిశీలించి సస్యరక్షణ చర్యల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి హరీశ్, ఏఈవో మహేశ్ తదితరులు ఉన్నారు.

ఎఫ్ఎల్ఎన్ అమలుపై సమీక్ష సమావేశం



మాట్లాడుతున్న నోడల్ అధికారి నాగయ్య

బోధన్: ప్రాథమిక పాఠశాలల్లో ఎఫ్ఎల్ఎన్(ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ) అమలు తీరుపై శుక్రవారం పట్టణ కేంద్రంలోని డివిజన్ డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ కార్యాలయంలో సాలూర మండల ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండల విద్యా శాఖ నోడల్ ఆఫీసర్ నాగయ్య మాట్లాడుతూ..3వ తరగతి విద్యార్థులకు చదవడం, రాయడంతో పాటు గణిత శాస్త్రంలో సామర్థ్యాల పెంపుదల కోసం వారి సామర్థ్యాలకు అనుగుణంగా బోధించేందుకు ప్రణాళిక అమలు చేయాలని దిశా నిర్దేశం చేశారు. నవంబర్‌లో నిర్వహించనున్న న్యాక్ పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధం చేయాలని సూచించారు.ఈ సందర్భంగా మోడల్ పాఠ్యాంశాలను బోధించారు. హెచ్ఎంలు బాలచంద్రం, ఆరిఫొద్దీన్, రిసోర్స్ పర్సన్స్ రాకేష్, శ్రీదేవి, హన్మాండ్లు పాల్గొన్నారు.

చెక్‌పోస్టులను ఏర్పాటు చేస్తాం



నిల్వ చేసిన సరుకులను పాలకవర్గ సభ్యులతో కలిసి పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ సంధ్యా దామోదర్

రెంజల్/ఎడపల్లి(బోధన్): గతంలో మూసివేసిన చెక్‌పోస్టులను బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సహకారంతో తిరిగి ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తానని బోధన్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సంధ్యా దామోదర్ పేర్కొన్నారు. శుక్రవారం రెంజల్, ఎడపల్లి పరిధిలోని మార్కెట్ కమిటీ గోదామును పాలకవర్గం సభ్యులతో కలిసి సందర్శించారు. మార్కెట్ కమిటీ పరిధిలోని ఎడపల్లి, నవీపేట్ మండలాల్లో కొనసాగుతున్న చెక్‌పోస్టుల ద్వారా అంతంత మాత్రంగానే ఆదాయం వస్తోందని, గతంలో రెంజల్ మండలం సాటాపూర్‌లోని చెక్‌పోస్టు ద్వారా నష్టాలు వాటిల్లడంతో ఎత్తివేసినట్లు వివరించారు. రెంజల్‌లో 5వేల మెట్రిక్ టన్నుల గోదాములో నిల్వ ఉన్న సరుకులను పరిశీలించారు. వైస్ చైర్మన్ శంకర్, డైరెక్టర్లు శ్రీనివాస్‌యాదవ్, కిషోర్, సలీం, రవి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



గ్యాస్ సబ్సిడీ పత్రాలను అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య

ఆర్మూర్‌టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య శ్రీనివాస్ అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో అభయహస్తం కార్యక్రమంలో భాగంగా మహాలక్ష్మి పథకానికి సంబంధించిన సబ్సిడీ పత్రాలను అందజేశారు. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద మహిళలకు రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందిస్తోందన్నారు. వైస్ చైర్మన్ షేక్‌మున్ను, కమిషనర్ రాజు, కౌన్సిలర్లు రహమాన్, ఇట్టడి నర్సారెడ్డి, ఆకుల రాము, కొంతం మురళి, రంగన్న బారడ్ రమేష్, సాల ప్రసాద్, ఫయాజ్, తదితరులు పాల్గొన్నారు.

వరిలో తెగుళ్ల పరిశీలన



ఆర్మూర్‌లో వరి పైరును పరిశీలిస్తున్న ఏవో హరికృష్ణ



కమ్మర్‌పల్లిలో వరిపంటను పరిశీలిస్తున్న ఏవో రమ్యశ్రీ

జిల్లాలోని పలు గ్రామాల్లో వరికి సోకిన తెగుళ్లను వ్యవసాయ అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాల వల్ల ఎక్కువగా ఆకు ముడత, ఎండుటాకుల తెగుళ్లు సోకాయని అధికారులు చెప్పారు. ఎన్ని మందులు పిచికారీ చేసినా తెగుళ్లు తగ్గడం లేదని ఈ సందర్భంగా రైతులు, అధికారుల వద్ద వాపోయారు. తెగుళ్ల నివారణకు ఏవోలు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. – పెర్కిట్(ఆర్మూర్)/మాక్లూర్/నవీపేట/కమ్మర్‌పల్లి/రుద్రూర్/ఎడపల్లి



కమలాపూర్‌లో పరిశీలిస్తున్న ఏవో నవీన్ కుమార్



మాక్లూర్: పంటను పరిశీలిస్తున్న ఏవో పద్మ

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1 –	మన్యం ధీరుడు (తెలుగు) - 01.25, చిక్లెట్స్ (తెలుగు) - 4.10, ఫైలం పిల్లగా (తెలుగు) - 6.50 హైడ్ ఎన్ సైక్ (తెలుగు) - 9.40
స్కీన్-3 –	మత్తు వదలరా-2(తెలుగు)-12.15 3.15 6.15 9.15
స్కీన్-4 –	సరిపోదా శనివారం- 11.30, 3.05, 6.40, 10.15

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	35: చిన్నకథ కాదు (తెలుగు)-4.30, మత్తు వదలరా(తెలుగు)- 7.20 10.25
స్క్రీన్-2	సరిపోదా శనివారం (తెలుగు) - 1.30 7.25
స్క్రీన్-3	ట్రాన్స్‌ఫార్మర్స్ (ఇంగ్లీష్ 3డీ) - 11.00, 4.40, 10.35, ప్రేమనగర్ (తెలుగు) - 7.20

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	ఫైలం పిలగా(తెలుగు)-1.15, మత్తు వదలరా-2 (తెలుగు) - 4.00, 7.00, 10.00
స్క్రీన్-2	ట్రాన్స్‌ఫార్మర్స్ వన్(3డీ ఇంగ్లీష్) - 11.00, 4.35, యుద్ధ (హిందీ) - 1.30, 7.05, స్త్రీ - 2 (హిందీ) - 10.10
స్క్రీన్-3	35 : మత్తువదలరా-2 -1.15, సరిపోదా శనివారం - 4.15 10.30, తుంబడ్ (హిందీ) - 7.50
స్క్రీన్ -4	చిక్లెట్స్ (తెలుగు)-9.55, తుంబడ్(హిందీ) - 12.35, యుద్ధ(హిందీ)-3.15, ప్రేమాభి షేకం-6.20, ప్రేమనగర్(తెలుగు)-10.10
లలితామహల్	సరిపోదా శనివారం (తెలుగు)
దేవి	మత్తు వదలరా-2 (తెలుగు)
నటరాజ్	యుద్ధ (హిందీ)
విజయ్	ఎ.ఆర్.ఎం 3డీ (తెలుగు)

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్స్‌డ్	160
		లైవ్	100
స్కిన్‌లెస్	200	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	75,900	వెండి (కిలో)	91,000
22 క్యారెట్స్	69,097		

– నిజామాబాద్ బిజినెస్

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

99122 20764
90102 86628 (నిజామాబాద్)
94920 10949 (బోధన్, బాన్సువాడ)
95055 08389 (ఆర్మూర్)

Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

ఆర్మూర్ సి. ప్రభాకర్ ACO : 9010585333
నిజామాబాద్ అర్బన్ & రూరల్ జి. రాంనాథ్ : 9849180084
బాల్కొండ ప్రదీప్ : 7893150102
బోధన్ ఎ.శివ : 9848956776
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899